
సాక్షి
ఒడిశా
బుధవారం । 25 । డిసెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,85,045లు, బంగారం 3 గ్రాములు వెండి 122 గ్రాముల 800 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.




ప్రత్యేక ప్రార్థనలు

క్రిస్మస్ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అలంకరణలు ఆకట్టుకున్నాయి.

- 10లో

కొత్త గవర్నర్‌గా హరిబాబు



భువనేశ్వర్: రాష్ట్ర కొత్త గవర్నర్‌గా డాక్టరు కంభంపాటి హరి బాబు నియమితులయ్యారు. భారత రాష్ట్రపతి ఆమోదం మేరకు ఈ నియామకం జరిగింది. రఘుబర దాస్ స్థానంలో ఆయన కొత్త గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

న్యూస్‌రీల్

అత్యాచారం కేసులో ఏడేళ్ల జైలుశిక్ష

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మహిళా కోర్టులో మంగళవారం అత్యాచారం కేసులో దోషిగా తేలిన షేక్ సూరికి ఏడేళ్ల జైలుశిక్ష విధించారు. ఖోయిర్‌పూట్ సమితి ముదిలిపోఢ పంచాయతీ అందుజోలి గ్రామం సమీప అడవిలో 2009లో ఇద్దరు మహిళలు కట్టెల కోసం అడవికి వెళ్లారు. అడవిలో ఒంటరిగా ఉన్న ఈ ఇద్దరి మహిళల్లో 50 ఏళ్ల మహిళపై సూరి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆమె కూతురు విషయాన్ని తెలుసుకుని ఖోయిర్‌పూట్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విషయం తెలుసుకున్న సూరి పరారయ్యాడు. 15 ఏళ్ల తర్వాత తిరిగి గ్రామానికి వచ్చిన సూరిని పోలీసులు సోమవారం రాత్రి అరెస్టు చేశారు. మంగళవారం కోర్టులో హాజరు పరచగా జడ్జి బబితా దాస్ ఈ మేరకు తీర్పునిచ్చారు.

గోల్డ్‌లోన్ ఇప్పిస్తానని మోసం



మల్కన్‌గిరి పోలీసులు అరెస్టు చేసిన నిందితుడు సోమ్యారంజాన్ దాస్

మల్కన్‌గిరి: యాక్సిస్ బ్యాంక్‌లో గోల్డ్‌లోన్ ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిని జిల్లా పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. భువనేశ్వర్‌లో సోమవారం నాడు మల్కన్‌గిరి పోలీసులు సోమ్యరంజాన్ దాస్ అనే వ్యక్తిను అరెస్టు చేశారు. ఈయన దొంగ పత్రాలు చూపించి సంతకాలు చేసి యాక్సిస్ బ్యాంకులో గోల్డ్‌లోన్ ఇప్పిస్తానని జనాలను మోసం చేస్తున్నాడు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురిని అరెస్టు చేశారు. కష్టమర్లు సోమ్యరంజాన్ భువనేశ్వర్‌లో ఉన్నట్లు సమాచారం ఇవ్వడంతో మల్కన్‌గిరి పోలీసులు ఓ బృందం భువనేశ్వర్ వెళ్లి అరెస్టు చేశారు.

పారాదీప్‌లో అనుమానాస్పద పావురాలు



అధికారుల అదుపులో పావురాలు

భువనేశ్వర్: రాష్ట్రంలో ఇటీవల కాలంలో సందిగ్ధ పావురాల సంచారం కనిపిస్తోంది. తాజాగా మంగళ వారం జగత్‌సింగ్‌పూర్ జిల్లా పారాదీప్ ఓడ రేవు ప్రాంతంలో రెండు అనుమానాస్పద పావురాల్ని గుర్తించారు. వీటి కాళ్లకు సాంకేతిక సమాచార అనుబంధ పరికరాలు ఉన్నట్లు దృష్టికి రావడంతో అనుమానం బలపడింది. పారాదీప్ ఇంటర్నేషనల్ కార్గో టెర్మినల్ పరిసరాల్లో కార్మికులు వీటిని గుర్తించారు. పావురాల కాళ్లకు అనుమానస్పద పరికరాలు తారస పడడంతో విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లారు. పోలీసులకు సమాచారం అందడంతో ఘటనా స్థలాన్ని సందర్శించారు. కుజంగ్ థాణా పోలీసులు పావురాల్ని పరిశీలించిన మేరకు అటవీ శాఖ అధికారులకు తెలియజేశారు. ఈ వర్గాలు సురక్షితంగా పావురాల్ని అదుపులోకి తీసుకుని తదుపరి దర్యాప్తు చేపట్టారు. పారాదీప్ సముద్రం పరిసరాల్లో సందిగ్ధ పావురాలు తారస పడడం వరుసగా ఇది రెండోసారి కావడం గమనార్హం.

విజిలెన్స్ వలలో మార్కెట్ ఇన్‌స్పెక్టర్



మమతా బెహరా

జయపురం: కొరాపుట్ జిల్లా దశమంతపూర్ మహిళా మార్కెటింగ్ ఇన్‌స్పెక్టర్ మమతా బెహరా లంచం తీసుకుంటూ దొరికిపోయారు. కొరాపుట్ పురపాలక పరిషత్ ప్రాంతం గ్రామీణ అభివృద్ధి కార్యాలయంలో ఓ కాంట్రాక్టర్ నుంచి రూ.7వేలు లంచం తీసుకుంటున్న సమయంలో విజిలెన్స్ సిబ్బంది పట్టుకున్నారు. అనంతరం కొరాపుట్ పూజారిపుట్‌లోని ఆమె ఇంటితో పాటు బరంపురంలోని ఇంటిలోనూ దాడులు చేశారు. ఈ దాడిలో అదనపు విజిలెన్స్ ఎస్పీ అరుణ కుమార్ నాయిక్, డీఎస్పీ అజయ కుమార్ ప్రధాన్, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ సంజయ్ ప్రధాన్, అనుభా దాస్ పాల్గొన్నారు.

వరి కొనుగోలు..
నిబంధనల సడలింపు



వరి కూడగట్టుకుంటున్న రైతులు

- టోకెన్ల చెల్లుబాటు గడువు పొడిగింపు
- నాణ్యత ప్రామాణికల సడలింపు

భువనేశ్వర్: రాష్ట్రంలో ఖరీఫ్ సీజను సాగు వరి కొనుగోలు నిబంధనలు సడలించి రైతులకు సముచిత న్యాయం చేసేందుకు ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసింది. అకాల వానల ప్రభావంతో అకస్మాత్తుగా ఊహాతీత పరిణామాలు తలెత్తాయి. ఈ పరిణామాల దృష్ట్యా వరి విక్రయానికి అనుకూలంగా రైతులకు వెసులుబాటు కల్పించేందుకు నిర్ణయించినట్లు రాష్ట్ర ఆహార, పౌర సరఫరా, వినియోగదారుల సంక్షేమ శాఖ మంత్రి కృష్ణ చంద్ర పాత్రొ మంగళవారం ప్రకటించారు. ఈ మేరకు ప్రభావిత ప్రాంతాల జిల్లా కలెక్టర్లకు విభాగం ఉత్తర్వులు జారీ చేసినట్లు మంత్రి పేర్కొన్నారు.

నాణ్యత ప్రామాణికం సడలింపు

అకాల వానలతో పలు చోట్ల పొలాల్లో పంట నీట మునిగింది. వాతావరణం సర్దుకున్న తర్వాత ఎండలో ఆరబెట్టిన వరి కొనుగోలుకు ఆమోదిస్తారు. వాన నీటిలో తడిసి ఎండలో ఆరిన వరి కొంత మేరకు నాణ్యత కోల్పోతుంది. లోగడ జారీ చేసిన నాణ్యత ప్రామాణికాలు సడలించి రైతుల నుంచి ప్రభావిత వరిని కొనుగోలు చేయడం జరుగుతుందని మంత్రి హామీ ఇచ్చారు.

గడువు పొడిగింపు

అకాల వానల ప్రభావం మండీల నిర్వహణని ప్రభావితం చేసింది. వీటి ప్రభావంతో కొన్ని చోట్ల మండీలు తెరిచేందుకు ప్రతికూల పరిస్థితులు ఎదురయ్యాయి. మరి కొన్ని చోట్ల వరి కొనుగోలు ప్రక్రియకు అంతరాయం ఏర్పడింది. ఇంతలో వరి విక్రయించేందుకు జారీ చేసిన అనుమతి టోకెన్ల గడువు పూర్తయ్యే పరిస్థితులు ఆవహించాయి. ఈ పరిస్థితిపై రైతులు ఆందోళన చెందకుండా మంత్రి అభయం ఇచ్చారు. వాతావరణ ప్రభావిత ప్రాంతాల్లో సముచిత వ్యవస్థ అందుబాటులోకి వస్తుందని, అతి తక్కువలో టోకెన్ల చెల్లుబాటు గడువుని 15 రోజుల వరకు పొడిగించనున్నట్లు మంత్రి ప్రకటించారు.

ఏడున్నర లక్షల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు

ఈ సీజనులో ఇప్పటి వరకు రాష్ట్రంలో పలు చోట్ల ఏడున్నర లక్షల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు పూర్తయ్యింది. ఈ నేపథ్యంలో ఒకటిన్నర లక్షల మంది రైతుల ఖాతాకు నగదు ప్రత్యక్షంగా బదిలీ అయింది. సాగు పెట్టుబడితో కనీస మద్దతు ధర కింద ప్రతి క్వింటాలు వరి విక్రయానికి ఒక్కో రైతు ఖాతాకు మొత్తం రూ. 2,100 చొప్పున బదిలీ చేసినట్లు మంత్రి తెలిపారు.

నష్ట పరిహారం

అకాల వానల ప్రభావంతో రైతాంగం ప్రభావితం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం న్యాయసమ్మతమైన పరిహారం చెల్లిస్తుందని రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి సురేష్ కుమార్ పూజారి తెలిపారు. ఈ మేరకు పంట నష్టం క్షేత్ర స్థాయిలో అంచనా వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యకలాపాల కోసం జిల్లా కలెక్టర్లకు ఆదేశించారు.

రోడ్డెక్కిన రైతులు

భువనేశ్వర్: రాష్ట్రంలో ఈ ఏడాది వరి కొనుగోలుపై ఎక్కడికక్కడ అసంతృప్తి కనిపిస్తోంది. ప్రభుత్వ ప్రకటన ప్రకారం నిర్ధారిత మార్గదర్శకాల మేరకు మండీల్లో వరి సేకరణ, కొనుగోలు తదితర అనుబంధ కార్యకలాపాలు సజావుగా సాగడం లేదనే ఆరోపణలు బలపడుతున్నాయి. క్రమంగా అసంతృప్తి కట్టలు తెంచుకుని రోడ్డెక్కుతోంది. నిర్ధారిత మార్గదర్శకాల మేరకు కార్యకలాపాలు చేపట్టక పోవడంతో వరి కొనుగోలులో అవాంఛనీయ జాప్యం తలెత్తుతోంది. ఈ కారణంతో పలు ప్రాంతాల్లో పొలాల్లో పంట వాన బారిన పడుతోంది.

సువర్ణపూర్ జిల్లాలో రైతుల ఆగ్రహం

వరి కొనుగోలు ప్రక్రియ పట్ల సువర్ణపూర్ జిల్లా రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ జిల్లాలో పలు చోట్ల మండీలకు చేరిన వరి కొనుగోలు పట్ల యంత్రాంగం నిర్లక్ష్యం ప్రదర్శిస్తుంది. ఇంత వరకు వరి కొనుగోలు చేయక పోవడంతో మండీల ప్రాంగణాల్లో రైతులు పడిగాపులు పడుతున్నారు. సువర్ణపూర్ జిల్లా దుంగురిపల్లి ప్రాంతంలో ప్రభుత్వం తెరిచిన మండీలో వరి కొనుగోలు చేయడం లేదని ఆగ్రహంతో రైతులు రహదారిపై బైఠాయించారు. వరి బస్తాలతో నడి రోడ్డు మీద బైఠాయించి రాస్తా రోకో ఆందోళనకు దిగారు.



వరి బస్తాలతో రోడ్డు ఎక్కి రాస్తా రోకో ఆందోళనకు దిగిన రైతులు

పంచాయతీ కార్యాలయానికి తాళం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి దుడుమేట్ల పంచాయతీ కార్యలయానికి సర్పంచ్ మాధవ్ మాడీ మంగళవారం తాళం వేశారు. పంచాయతీ కోసం వచ్చిన నిధులు వినియోగించకుండా ఉంచేశారని ఆరోపించారు. బిల్లులు కూడా ఇవ్వడం లేదన్నారు. విషయం తెలుసుకున్న కోరుకొండ సమితి అధికారి ఆముల్య కుమార్ సాహు స్పందించి సర్పంచ్‌తో చర్చించారు.



దుడుమేట్ల పంచాయతీ కార్యాలయానికి తాళం వేసిన సర్పంచ్

సెల్‌ఫోన్ల దొంగ అరెస్టు



నిందితుడు జగన్నాథ నాయిక్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలోని మహేశ్వరి కాలనీలో రాహుల్ సింగ్రాయ్ అనే సెల్‌ఫోన్ దుకాణంలో నవంబర్ 12న చోరీ జరిగింది. ఆయన 13న ఫిర్యాదు చేయగా ఐఐసి రీగాన్ కీండో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం నవరంగ్‌పూర్‌కు చెందిన జగన్నాథ్ నాయక్‌ను అరెస్టు చేసి అతని వద్ద 10 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

13 నుంచి 20 వరకు..
జయపురంలో పుష్యపుణి ఉత్సవాలు



సన్నాహక సమావేశంలో పాల్గొన్న కళాకారులు

జయపురం: జయపురంలో గత ఐదేళ్లుగా అంగరంగ వైభవంగా జరుపుతున్న పుష్యపుణి ఉత్సవాలను ఈసారి కూడా ఘనంగా నిర్వహించాలని కళా బృందాలు నిశ్చయించాయి. జనవరి 13 నుంచి 20వ తేదీ వరకు ఉత్సవాలను ఆడంబరంగా జరపాలని మంగళవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో నిర్ణయించారు. కొరాపుటియ కళా, కళాకారుల సంఘం నిర్వహించిన సమావేశలో పలువురు కళాకారులు పాల్గొన్నారు. గత ఏడాదికంటే ఘనంగా ఈసా పుష్యపుణి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరపాలని నిర్ణయించింది. తొలిరోజున స్థానిక కళాకారులతో విశాల ర్యాలీ నిర్వహించాలని తీర్మానించారు. బంకమఠ నుంచి కళాకారుల ర్యాలీ ప్రారంభమై జయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం వద్ద ముగించాలని భావిస్తున్నారు. రోజూ నృత్య నాట్యాల ప్రదర్శన ఉంటుందన్నారు. ఉత్సవాల్లో ఒడిశాలో ప్రసిద్ధ గాయకులు అమీష పండ, అనూరాధా పాణిగ్రహిలు పాల్గొంటారని ప్రముఖ సంగీత కళాకారులు ధిరెన్ పట్నాయక్ వెల్లడించారు. అలాగే ఒడియా కంఠ శిల్పులను, తెలుగు చలన చిత్ర కళాకారులను ఆహ్వానిస్తున్నామన్నారు. పుష్యపుణి సంపూర్ణ కార్యక్రమం త్వరలో జరుగనున్న సమావేశంలో నిర్ణయించనున్నట్లు వెల్లడించారు. ఉత్సవాల సందర్భంగా పౌరాణిక వేషాలు, ఆదివాసీ వేష పోటీలు, జయపురంలోని వివిధ నాట్య సంస్థలచే నాటక పోటీలు, కొరాపుట్ చిన్న సినిమాల ప్రదర్శన పోటీలు ఉంటాయన్నారు. అలాగే తొలిసారిగా కవితా పఠన పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. పల్లిశ్రీ మేళా, మీణా బజార్, ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఈ నెల 26 వ తేదీన ఆవిష్కరిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ప్రముఖ కళాకారులు జయంత సాంత, మనోజ్ కుమార్ పాత్రో, శ్రీకాత దాస్, ప్రియూష పట్నాయక్, గుప్తేశ్వర పాణిగ్రహి, జి.మహేష్, మురళీ పట్నాయక్, కమళా కాంత రథ్ పాల్గొన్నారు.

నేనూ చిట్‌ఫండ్ బాధితుడినే: సీఎం



కార్యక్రమానికి హాజరైన వినియోగదారులు



రాష్ట్ర స్థాయి వినియోగదారుల దినోత్సవ వేదికపై ముఖ్యమంత్రి ప్రసంగం

భువనేశ్వర్: రాష్ట్రంలో తీవ్ర కలకలం రేపిన చిట్‌ఫండ్ మోసాల్లో తాను బాధితుడినేనని రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రకటించారు. స్థానిక లోక్ సేవా భవన్‌లో మంగళవారం నిర్వహించిన జాతీయ వినియోగదారుల దినం సభా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వరుసగా 1990 మరియు 2002 సంవత్సరాల్లో 2 సార్లు చిట్ ఫండ్ కుంభకోణాలకు గురైనట్లు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ప్రకటించారు. వినియోగదారుల రక్షణ కోసం తొలి సారిగా భారత ప్రభుత్వం 1986 సంవత్సరంలో వినియోగదారుల చట్టం ప్రవేశ పెట్టింది. నరేంద్ర మోదీ సర్కారు 2019 సంవత్సరంలో సరికొత్త సవరణలు, సంస్కరణలతో ఈ చట్టాన్ని మరింత బలోపేతం చేసింది. మరో వైపు చట్ట ప్రయోజనాలు సాధారణ వినియోగదారులు సులభంగా వినియోగించేందుకు మార్గం సుగమం చేసింది. అలాగే చిట్ ఫండ్స్ చట్టంలో మోదీ ప్రభుత్వం సవరణలు చేసి చిట్ ఫండ్ పథకాల్లో పారదర్శకతకు పదును పెట్టిందని, దీంతో పాత లొసుగులు తొలగిపోయి వినియోగదారులకు ప్రయోజనకరంగా నిలుస్తుందని సీఎం అన్నారు. రాష్ట్రంలో నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని మునుపటి బిజూ జనతా దళ్ ప్రభుత్వం చిట్‌ఫండ్ మోసాలపై విచారణకు ప్రత్యేక న్యాయ కమిషన్ ఏర్పాటు చేసింది. సన్నకారు ఖాతాదారులకు మోసపోయిన సొమ్ము ఫిరాయించేందుకు 2013 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.300 కోట్ల కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేసింది. జస్టిస్ ఎంఎం దాస్ అధ్యక్షతన న్యాయ కమిషన్ సుమారు 1,00,000 మంది సన్నకారు బాధిత ఖాతాదారులను గుర్తించింది. వీరంతా రూ.10,000 లేదా అంతకంటే తక్కువ సొమ్ము చిట్‌ఫండ్‌లో పెట్టుబడి పెట్టిన వారుగా న్యాయ కమిషను పేర్కొందని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. రాష్ట్రంలో చిట్‌ఫండ్ కుంభకోణంలో ప్రభావితమైన దాదాపు 2 లక్షల మంది సన్నకారు పెట్టుబడిదారులకు తమ డబ్బును తిరిగి పొందారని ముఖ్యమంత్రి తెలిపారు. ఒడిశాలోని 35 అక్రమ ఆర్థిక సంస్థలకు చెందిన 1,472.428 ఎకరాల విస్తీర్ణపు స్థిరాస్తులను అధికారులు జప్తు చేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

ఎలక్ట్రానిక్స్ గోదాంలో అగ్ని ప్రమాదం



గోదాంలో అగ్ని ప్రమాదం దృశ్యం



మంటల నివారణలో రోబోట్ వినియోగం

భువనేశ్వర్: ఎలక్ట్రానిక్స్ గోదాంలో సోమవారం రాత్రి పూట భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ప్రాణ హాని లేకున్న అపార ఆస్తి నష్టం సంభవించింది. స్థానిక సత్య నగర్ ప్రాంతంలో ఈ సంఘటన సంభవించింది. 2 యూనిట్ల అగ్ని మాపక దళం రంగంలోకి దిగి మంటలు నివారించారు. ఈ చర్యల్లో తొలి సారిగా రోబోట్ వ్యవస్థని విజయవంతంగా ప్రయోగించారు. సాధారణ వ్యక్తులకు సాధ్యం కాని మంటల్లో నీరు చిమ్మే వంటి కార్యకలాపాలకు ఈ వ్యవస్థ దోహదపడి నష్టం, హానికర పరిస్థితుల సత్వర నివారణకు దారి తీస్తుందని అగ్ని మాపక దళం వర్గాలు తెలిపాయి.

కేంద్రమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి



ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

- కాంగ్రెస్ నాయకుల డిమాండ్

రాయగడ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తన పదవికి రాజీనామ చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ రాయగడ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. కొరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక నేతృత్వంలో ఆ పార్టీ సీనియర్ నాయకుడు రామచంద్ర కడమ్, రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక, బిసంకటక్ ఎంఎల్‌ఏ నీలమాధవ హికక, గుణుపూర్ ఎంఎల్‌ఏ సత్యజీత్ గొమాంగో, పీసీసీ సాధారణ కార్యదర్శి దుర్గా ప్రసాద్ పండ, అస్లామ్ ఖాన్, కార్యకర్తలు ఆందోళనలో పాల్గొన్నారు. ముందుగా స్థానిక కొత్త బస్టాండు వద్ద గల బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేశారు. కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేసిన అనంతరం అమిత్ షా దిష్టి బొమ్మను దహనం చేశారు. భారత రాష్ట్రపతి పేరిట వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారికి సమర్పించారు.

రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి



నిరసనలో రైతులు

పర్లాకిమిడి: అకాల వర్షాలకు నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. గుసాని సమితిలోని పలు గ్రామాల్లో అకాల వర్షాలకు ధాన్యం పొలాల్లోనే తడిసి రంగుమారి మొలకెత్తాయి. దీంతో జిల్లాలోని గుసాని సమితి బాగుసల పంచాయతీ రైతులు మంగళవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి తమను ఆదుకోవాలని కోరుతూ వినతి పత్రా న్ని మంగళవారం అందజేశారు. అకాల వర్షాలకు పొలాల్లో ధాన్యం తడిచిపోయి మొలకలు వచ్చాయి. అందువల్ల రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని జిల్లా కృషక్ మోర్చా అధ్యక్షులు (బీజేపీ) ప్రశాంత్ కుమార్ పాలో డిమాండ్ చేస్తున్నారు. బాగుసల పంచాయతీలో రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని, రంగుమారిన ధాన్యం కోనుగోలు చేయాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు (గుసాని సమితి) జి.శ్రీధర నాయుడు కలెక్టర్ బిజయ కుమార్ దాస్‌కు విజ్ఞప్తి చేశారు.



గజపతి కలెక్టర్ కార్యాలయం మాట్లాడుతున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీధరనాయుడు



కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న కృషక్ మోర్చా అధ్యక్షులు ప్రశాంత్ పాలో



గుసాని సమితి బాగుసలలో ధాన్యంపై టార్పాలిన్ కప్పుతున్న రైతు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

• మరొకరికి గాయాలు



ప్రమాద స్థలంలో వాహనాలు

జయపురం: కొరాపుట్– బొరిగుమ్మ రహదారి రాణిగుడ సమీపంలోని ఉప్పర్ మంగర వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందారు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. మరణించిన వ్యక్తి నవరంగపూర్ పట్టణం దండసాహి వ్యక్తిగా గుర్తించారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని వెంటనే కొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయక్ వైద్య కళాశాల హాస్పిటల్‌కు తరలించారు. కంటైనర్‌ను ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొనటంతో ప్రమాదం జరిగినట్లు సమాచారం. క్షతగాత్రుని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు.

జెమ్స్‌లో చిన్న పిల్లలకు ఉచిత వైద్య సేవలు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చిన్న పిల్లలకు ఉచిత వైద్య సేవలను బుధవారం నుంచి అందిస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 0–5 సంవత్సరాల్లోపు పిల్లలకు ఈ నెలలో జలుబు, దగ్గు, శ్వాసకోస ఇన్‌ఫెక్షన్లు, న్యూమోనియా, ఆస్తమా, వైరల్ ఇన్‌ఫెక్షన్లు, జీర్ణకోశ వ్యాధులు, చెవి ఇన్‌ఫెక్షన్లు వంటివి తరచుగా వస్తుంటాయని అలాంటి పిల్లలకు ఉచితంగా జెమ్స్‌లో ప్రత్యేకమైన చికిత్స అందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మరిన్ని వివరాలకు 7680945332 అనే నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ధరల పెంపే మీ విజనా..?



విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన కార్యక్రమ గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న ధర్మాన కృష్ణదాస్ తదితరులు

నరసన్నపేట: అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి రాగానే ఏకంగా రూ.15,450 కోట్ల మేరకు ప్రజలపై భారం వేశారని వైఎస్సా ర్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ధ్వజమెత్తారు. ధరల పెంపే మీ విజనా అని సూటిగా ప్రశ్నించారు. విద్యుత్ చార్జీల పెంపుదలను నిరసిస్తూ ఈ నెల 27న నియోజకవర్గ కేంద్రాల్లో వైఎస్సార్‌సీపీ పోరుబాట నిర్వహిస్తుందని అన్నారు. నరసన్నపేట పార్టీ కార్యాలయంలో ఆయన మంగళవారం దీనికి సంబంధించిన గోడ పత్రిక విడుదల చేశారు.

నమ్మించి మోసం చేశారు..

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికా రం కోసం కూటమి నాయకులు ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చారని, అధికారం దక్కా క ఆ మాటలన్నీ మర్చిపోయారని అన్నారు. జిల్లాలో విద్యుత్ వినియోగదారులపై నెల వారీగా సుమారుగా రూ. 10 కోట్లు పైనే ఈ భారం ఉండనుందని తెలిపారు. ప్రజలను నమ్మించి మోసం చేయడం టీడీపీ నాయకులకు అలవాటేనని అన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక పాలనపై సామాన్యుల గొంతుక వినిపించేందుకే వైఎస్సార్‌సీపీ ఈ విధంగా నిరసన, పోరుబాట కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో నరసన్నపేట, జలుమూరు ఎంపీపీలు ఆరంగి మురళి, వాన గోపి, పోలాకి మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు ముద్దాడ బైరాగినాయుడు, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం, ప్రిన్సిపాల్ సెలవుపై వెళ్లండి

శ్రీకాకుళం న్యూకాలనీ, జలుమూరు: విద్యార్థులకు ఆదర్శంగా ఉండాల్సిన గురువులే పల్చనవుతుండటం సరికాదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జిల్లాలోని జలుమూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, జలుమూరు జూనియర్ కళాశాల ల ప్రాంగణంలో పనులు, చెట్ల నరికివేత పంచాయతీ మంగళవారం రాత్రి కలెక్టర్ వద్దకు చేరింది. డీవీఈఓ ఎస్.తవిటినాయుడు, డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, జలుమూరు హెచ్‌ఎం , ప్రిన్సిపాల్‌తోపాటు ఉపాధ్యాయులు, లెక్చరర్లు హాజరయ్యారు. ఇరు విద్యాసంస్థల వాదనలు విన్న కలెక్టర్ హెచ్‌ఎం, ప్రిన్సిపాల్‌ను నెలరోజులపాటు సెలవు తీసుకోవాలని ఆదేశించారు. అక్కడి వాస్తవ పరిస్థితులను తెలియజేస్తూ ఇంటర్మీడియెట్ విద్య డీవీఈఓ శివ్వాల తవిటినాయుడును నెలరోజుల్లో నివేదికను తన ముందుంచాలన్నారు. నివేదిక ఆధారంగా కచ్చితంగా చర్యలు తీసుకుంటానని కలెక్టర్ స్పష్టం చేశారు.



విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలి



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



వేదికపై విశ్వజిత్ ద్వివేది, రాజేష్ కుమార్ పాఢి తదితరులు

• సెన్ ఫెస్ట్ -14.0 కార్యక్రమంలో జేకేపేపర్ మిల్ ఉపాధ్యక్షులు ద్వివేది

రాయగడ: విద్యార్థుల్లో పోటీత్వంపెరగాలని.. అప్పుడే వారు చదువుతోపాటు ఇతర రంగాల్లో రాణించగలరని జేకే పేపర్ మిల్ ఉపాధ్యక్షులు (వాణిజ్యం) విశ్వజిత్ ద్వివేది అన్నారు. స్థానిక పితామహల్‌లోని సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో సెన్‌ఫెస్ట్ -14.0 పేరిట సోమవారం సాయంత్రం జరిగిన వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ద్వివేది మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు ఇతర రంగాల్లో కూడా ఆసక్తి కనబరచగలిగితే వారి భవిషత్ ఉజ్వలంగా మారుతోందన్నారు. విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయులపై ఆధార పడి ఉంటుందన్నారు. వారు సరైన మార్గంలో పిల్లలను నడిపించాలని అన్నారు. విశ్వవిద్యాలయం డైరెక్టర్ డాక్టర్ రాజేష్ కుమార్ పాఢి మాట్లాడుతూ.. ఏటా విశ్వవిద్యాలయంతో పాటు అనుబంధ సెంచూరియన్ స్కూళ్లలో వార్షికోత్సవాలను జరుపుతామన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులను ప్రొత్సాహించే విధంగా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. గౌరవ అతిథిగా హాజరైన జిల్లా అదనపు విద్యాశాఖ అధికారి భజన్ లాల్ మాఝి మాట్లాడుతూ.. పుట్టగొడుగుల్లా విద్యాసంస్థలు పెరుగుతున్నాయని అన్నారు. స్మార్ట్ తరగతులను నిర్వహించడంతో విద్యార్థులు చురుగ్గా చదువుకోగలుగుతున్నారని అన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఎక్కువ మంది తల్లిదండ్రులు వారి పిల్లలను చేర్పిస్తున్నారని అన్నారు. వ్యాపారపరంగా కాకుండా విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని విద్యాసంస్థలు బోధనలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత, కవి సుశాంత్ కుమార్ నాయక్, విశ్వవిద్యాలయం అధ్యక్షులు రాధా క్రిష్ణ మహాపాత్రొ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి.







కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు


పండగకు సిద్ధం



1882 లో నిర్మించిన చర్చ్ ఫొటో



26 వ జాతీయ రహదారిలో నక్షత్రాలు, క్రాస్‌లతో తోరణం



జయపురం ఎవాంజిలికల్ లూథరిన్ చర్చ్

జయపురం: జయపురం ఎవాంజిలికల్ లూథరిన్ చర్చ్‌కి 143 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ చర్చ్ జయపురంలో 1882 మే 31న నిర్మించారు. జేఈఎల్‌సీలో దాదాపు 4 లక్షల మంది సభ్యులు ఉన్నారు. 100 మందికి పైగా మంత్రులు ఉన్నట్లు జయపురం జెఇఎల్‌సి వర్గాలు వెల్లడించాయి. 19వ శతాబ్దంలో జర్మనీ నుంచి మిషనరీలు ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు చర్చల ఏర్పాటుకు అనేక కష్టాలు పడ్డారు. జగదల్‌పూర్‌లో చర్చ్ నిర్మాణానికి ఆనాటి బస్తర్ రాజు నిరాకరించటంతో నిరాశ చెందిన మిషనరీ పెద్దలు ఆనాటి జయపురం మహారాజు మూడవ విక్రమదేవ్‌ను ఆశ్రయించారు. విక్రమదేవ్ అనుమతి ఇక్కడ నిర్మాణం జరిగింది. ఈ చర్చితో పాటు చుట్టుపక్కల విద్య, వైద్య సదుపాయాలను కూడా కల్పించారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణే ధ్యేయం

జయపురం: వినియోగదారుల హక్కుల రక్షణ, వివాదాల పరిష్కారం, సాధికారత పరిరక్షణే జాతీయ వినియోగదారుల దినోత్సవం ధేయమని కొరాపుట్ జిల్లా వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ అధ్యక్షుడు ప్రఫుల్ల కుమార్ పండా అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా స్థానిక సిటీ ఉన్నత పాఠశాలలో జిల్లా కొలతలు, తూనికల విభాగం, జిల్లా కంజ్యూమర్ కోర్టు, జిల్లా సివిల్ సప్లయ్, వినియోగదారుల సంక్షేమ విభాగాలు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమానికి పండా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జాతీయ వినియోగదారుల దినోవ్సతం ప్రతీ ఏటా డిసంబర్ 24న నిర్వహిస్తున్నామన్నారు. వినియోగదారులకు వారి హక్కులు, బాధ్యతలపైన అవగాహన కల్పించం ప్రధాన లక్ష్యం అన్నారు. వినియోగదారులు అనేక విధాలా మోసగించబడుతున్నారని, ముఖ్యంగా కల్తీ వస్తువులు, నకిలీ వస్తువుల ద్వారానే కాకుండా, తూకంలోనూ మోసపోతున్నారన్నారు. అటువంటివారికి న్యాయం, రక్షణ కలిపించటం జరుగుతుందన్నారు. వినియోగదారులను మోసగించే విక్రేతలను చట్టం శిక్షిస్తుందన్నారు. కంజ్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ వినియోగదారుల హక్కులకు రక్షణ కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ సత్యజిత్ బిశ్వాల్, ఇన్‌స్పెక్టర్ బిజయకుమార్ నాయక్, సరోజ్ కుమార్ గౌడ, జయపురం సిటీ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు బి.సుజాత,"పాఠశాల పరిచాలన కమిటీ అధ్యక్షుడు సుధాకర పట్నాయక్, కమిటీ సభ్యులు శశి"పట్నాయక్, ఉపాధ్యాయులు ప్రతాప్ పట్నాయక్ ప్రసంగించారు. జిల్లా వెయిట్ అండ్ మెజర్స్ విభాగ ఇన్‌స్పెక్టర్ ఎలక్ట్రానిక్ కాటాలను ప్రదర్శించారు.



జయపురం: జాతీయ వినియోగదారుల దినోత్సవంలో పాల్గొన్న ముఖ్యఅతిథి, తదితరులు



జయపురం: కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు




వినియోగదారుల్లో చైతన్యవంతం రావాలి

పర్లాకిమిడి: జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని స్థానిక యూటెక్ కంప్యూటర్ కార్యాలయంలో మంగళవారం అఖిల భారత గ్రాహక్ పంచాయత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రాహక్ పంచాయత్ కార్యదర్శి డాక్టర్ మధుసూదన్ నాయక్ ప్రారంభించారు. గౌరవ అతిథులుగా ఆశాలతా పాణిగ్రాహి, లోకనాథ మిశ్రా, భారతీయ మానవ హక్కుల కౌన్సిల్ అధ్యక్షుడు లోకనాథ పాడి తదతరులు హాజరయ్యారు. మార్కెట్‌లో కల్తీ వస్తువులు, అప్రకటిత కరెంట్ కోతలు, చైనా మీటర్లు పెట్టి వినియోగదారుల హక్కులను కాలరాస్తున్నారని మానవ హక్కుల కౌన్సిల్ అధ్యక్షుడు లోకనాథ పాడి అన్నారు. వినియోగదారులు తమ హక్కులను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ చైతన్యవంతులు అవ్వాలన్నారు. జాతీయ వినియోగదారుల (గ్రాహక్ పంచాయత్) అధ్యక్షుడు హరిమోహన్ పట్నాయక్ కార్యక్రమాన్ని అధ్యక్షత వహించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ బిగ్నరాజ్ పండా, సహకార్యదర్శి రాంచరణ్ దాస్, జయకృష్ణ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనలు



బాప్టిస్టు చర్చిలో జీసస్ (ఫైల్)



పర్లాకిమిడిలో కాలేజ్ రోడ్డులో పురాతన పురుషోత్తం బాప్టిస్టు చర్చి

క్రిస్మస్ సందర్భంగా పట్టణంలోని చర్చిలు అందంగా అలంకరించారు. పట్టణంలోని కాలేజ్ రోడ్డులో అతి పురాతన పురుషోత్తం బాప్టిస్టు చర్చిలో క్రీస్తు జన్మదినం పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అలాగే దోలా ట్యాంకు రోడ్డులో ఉన్న ఒడియా బాప్టిస్టు చర్చి, ఆర్‌సీఎం చర్చిలలో క్రీస్తు ఆగమనంపై ప్రత్యేక బొమ్మల ప్రదర్శన పెట్టి, ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. – పర్లాకిమిడి



మార్కెట్‌లో క్రిస్మస్ స్టార్స్ అమ్మకాలు



క్రీస్తు జననంపై బొమ్మల కొలువు



దోలా ట్యాంకు రోడ్డులో ఆర్‌సీఎం చర్చి

వాజ్‌పేయి కాంస్య విగ్రహం ఆవిష్కరణ



కటక్ నగరంలో బెల్ వ్యూ కూడలి ప్రాంతంలో అటల్ బిహారి వాజ్‌పేయి నిలువెత్తు విగ్రహం



ఆవిష్కరణ సందర్భంగా విగ్రహానికి పాదాభివందనం చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: కటక్ మహా నగరంలో భారత మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారి వాజ్‌పేయి నిలువెత్తు విగ్రహాన్ని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి మంగళ వారం ఆవిష్కరించారు. బెల్ వ్యూ కూడలి ప్రాంతంలో 10 అడుగుల నిలువెత్తు కాంస్య విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రముఖ విగ్రహ కళాకారుడు సంజీబ్ బిశ్వాల్, శిల్పి లక్ష్మీధర రాణా ప్రత్యక్ష పర్యవేక్షణలో 10 క్వింటాళ్ల కంచుతో దీనిని రూపొందించారు. భారత మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారి వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ విగ్రహాన్ని ఆవిష్కరించనట్లు ముఖ్యమంత్రి తెలిపారు. కార్యక్రమానికి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, నగర మేయరు సుబాష్ చంద్ర సింగ్, బారాబటి కటక్ నియోజక వర్గం ఎమ్మెల్యే సోఫియా ఫిరదౌస్, కటక్ జిల్లా కలెక్టరు దత్తాత్రి భావు సాహెబ్ సింధే హాజరయ్యారు.

ఘనంగా కోటమేట ఉత్సవాలు



మాట్లాడుతూన్న చిత్రకొండ ఎమ్మెల్యే మంగుఖీలో



నృత్యం చేస్తున్న గిరిజనులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి సమితిలోని కోటమేట గ్రామ ఉత్సవాలను తొలిసారి నిర్వహిస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా ఒపెరా, మినా బజార్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా చిత్రకొండ ఎమ్మెల్యే మంగుఖీలో హాజారై ఉత్సవాలను ప్రారంభించారు. ఈ ఉత్సవాలు ఈ నేల 22 నుంచి 28 వరకు జరుగుతాయి. గిరిజన సంప్రదాయాల మధ్య కలశ యాత్రను నిర్వహించారు.

క్లుప్తంగా

పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు



పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్‌లు శాస్త్రోక్తంగా నిత్య పూజాదికాలు చేశారు. అమ్మవారికి తీపిపదార్థాలు, పండ్లతో నివేదన చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి, తరించారు.

సీనియర్ మహిళల కబడ్డీలో పట్టణ విద్యార్థిని ప్రతిభ



విజేతను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీసాయిదేవమణి

విజయనగరం అర్బన్: ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో ఇటీవల జరిగిన 71వ ఆంధ్ర సీనియర్ పురుషులు, మహిళల కబడ్డీ చాంపియన్‌షిప్‌లో విజయనగరం మహిళల జట్టు ద్వితీయస్థానం సాధించాయి. ఆ జట్టులో సత్య కళాశాల విద్యార్థిని బి.నీలిమ విజయంలో కీలకపాత్ర వహించింది. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీసాయిదేవమణి మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విజేతను కళాశాల యాజమాన్యం అభినందించింది.

290 మద్యం బాటిల్స్ స్వాధీనం

గుర్ల: మండలంలోని కోటగండ్రేడులో 290 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని ఆరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై నారాయణ రావు మంగళవారం తెలిపారు. కోటగండ్రేడు సమీపంలో తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తిని తనిఖీ చేయగా 290 మద్యం బాటిల్స్ పట్టుబడినట్లు ఎస్సై చెప్పారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్సై హెచ్చరించారు.

మెంటాడలో 122 మద్యం బాటిల్స్

మెంటాడ: అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తినుంచి 122 మద్యం సీసాలను పట్టుకున్నట్లు మెంటాడ ఎస్సై కె.సీతారాం తెలిపారు. ఈ మేరకు మండలంలోని అమరావలస నుంచి జయతి గ్రామం మధ్య టీవీఎస్ ఎక్సెల్ వాహనంతో 122 మద్యం సీసాలను తీసుకువెళ్తున్న వ్యక్తిని మంగళవారం అదుపులోకి తీసుకోవడంతో పాటు వ్యక్తి దగ్గర ఉన్న 122 మద్యం బాటిల్స్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచామన్నారు.

బొబ్బిలిలో 80 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

బొబ్బిలి: పట్టణంలోని మద్యం దుకాణం నుంచి అక్రమంగా మద్యం సీసాలను బెల్ట్ షాపులకు తరలిస్తుండగా ఎస్సై ఆర్.రమేష్ సిబ్బందితో దాడి చేసి ఓవ్యక్తిని మంగళవారం పట్టుకున్నారు. నిందితుడి దగ్గర నుంచి 80 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి నిందితుడిని కోర్టుకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



రైలు పట్టాల పక్కన మహిళ మృతదేహం

విజయనగరం క్రైమ్: విజయనగరం, కోరుకొండ రైల్వేస్టేషన్‌ల మధ్య సారిక గ్రామసమీపంలో రైల్వేట్రాక్‌పక్కన అనుమానాస్పదరీతిలో మహిళ మృతి చెందినట్లు గుర్తించామని జీఆర్‌పీ ఎస్సై వి.బాలాజీరావు మంగళవారం తెలిపారు. మహిళ మృతదేహం పడి ఉన్నట్లు అందిన సమాచారంతో అక్కడికి వెళ్లి పరిశీలించగా సుమారు 25 నుంచి 30 ఏళ్ల వయసు కలిగి, ఐదు అడుగుల రెండు అంగుళాల ఎత్తు కలిగి, ఛామనచాయ రంగు, తెలుపురంగుపై నలుపు రంగు పువ్వులు కలిగిన టాప్, నీలం రంగు ప్యాంట్ ధరించి ఉందన్నారు. అకస్మాత్తుగా రైల్లోంచి జారిపడిపోయిందా? ఇంకేమైనా జరిగి ఉంటుందా ? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించామని ఆచూకీ తెలిసిన వారు ఫోన్ 9490617089 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సబ్ డివిజన్‌ల సమస్యను పరిష్కరించాలి

- రైతుసదస్సులో పాల్గొన్న కలెక్టర్



ఆర్.ముంగినాపల్లి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

డెంకాడ: భూముల జాయింట్ ఎల్‌పీఎం సబ్‌డివిజన్‌లకు సంబంధించిన సర్వే సమస్యలను జిల్లాలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల సందర్భంగా గ్రామస్తుల సమక్షంలోనే పరిష్కరించాలని కలెక్టర్ డా.బీఆర్.అంబేడ్కర్ తహసీల్దార్‌కు సూచించారు. ఈ మేరకు డెంకాడ మండలం ఆర్.ముంగినాపల్లిలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ అంబేడ్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు రీ సర్వేలో భూముల సబ్ డివిజన్ అంశాలను కలెక్టర్‌కు విన్నవించారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఆయా సమస్యలను రైతుల సమక్షంలోనే పరిష్కరించి సబ్‌డివిజన్‌లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. గ్రామంలో అసైన్డ్ భూములను సాగు చేస్తున్న రైతులను గుర్తించి వారికి ఆయా భూములపై పట్టాలు మంజూరు చేసేందుకు జనవరిలో జరిగే నియోజకవర్గ స్థాయి అసైన్డ్ కమిటీల్లో ప్రతిపాదించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పేర్లను కమిటీలో పరిశీలించి ఆమోదించవచ్చన్నారు. గ్రామంలోని పలువురు రైతులు అసైన్డ్ భూములు సాగుచేస్తున్నప్పటికీ తమ పేర్లు ప్రభుత్వ రికార్డుల్లో సాగుదారులుగా నమోదు కాలేదని పలువురు రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ జోక్యం చేసుకుంటూ గ్రామంలోని అర్హులైన అసైన్డ్ భూముల సాగుదారులను గుర్తించేందుకు ఇద్దరు లేదా ముగ్గురు సర్వేయర్లతో కమిటీ వేసి గ్రామంలోని అసైన్డ్ భూమిలో ఎవరు సాగుచేస్తున్నారో వాస్తవంగా నిర్ధారించి వారికి పట్టాలు అందజేసేందుకు ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ పద్మావతికి సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో అసైన్డ్ భూమి ఎంత? ఎంతమంది సాగుదారులు ఉన్నారనే అంశాన్ని వివరించాలని వీఆర్‌ఓను ఆదేశించారు. గ్రామంలో 27 ఎకరాల అసైన్డ్ భూమి ఉండగా 36 మంది రైతులు సాగుచేస్తున్నట్లు వీఆర్‌ఓ వివరించారు.

ప్రాజెక్టు పేరుతో మొత్తం భూమి ఆన్‌లైన్

గ్రామానికి చెందిన రైతు చింతాడ నరసింహప్పడు రెవెన్యూ సదస్సులో తన సమస్యను వివరిస్తూ తన తండ్రి పేరున ఉన్న 3.75 ఎకరాల భూమిలో తారకరామ తీర్థసాగరం ప్రాజెక్టుకు ఒక ఎకరా ఇచ్చామని, అయితే ఆ సర్వే నంబర్‌లో ఉన్న భూమినంతటినీ ప్రాజెక్టు పేరుతో ఆన్‌లైన్‌లో చూపిస్తున్నారని వివరించాడు. దీనికి స్పందించిన కలెక్టర్ అంబేడ్కర్ ప్రాజెక్టులకు భూసేకరణలో భూములు ఇచ్చిన రైతులకు సంబంధించి వారి నుంచి సేకరించిన భూవిస్తీర్ణం మినహాయించి సర్వే నంబర్‌లోని మిగిలిన భూమిని సంబంధిత రైతు పేరున ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని ఆదేశించారు. ప్రాజెక్టులకు భూసేకరణ చేసే సమయంలో భూముల సబ్ డివిజన్ చేయకపోవడం వల్ల ఈ సమస్య ఉత్పన్నమైందని, ఇదే తరహాలో గ్రామాల్లో ప్రాజెక్టులకు భూమి ఇచ్చిన ఇతర రైతులకు కూడా సమస్యలు ఉండవచ్చని, ప్రాజెక్టులకు భూములు ఇచ్చిన వారందరి భూములు పరిశీలించి వారు ప్రాజెక్టుకు ఇచ్చిన భూమిని మినహాయించి మిగిలిన విస్తీర్ణాన్ని ఆ రైతుల పేరుతో సబ్ డివిజన్ నంబర్‌లు కేటాయించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని చెప్పారు. గ్రామంలో పలువురు రైతులు, వ్యవసాయ అధికారులతో కలెక్టర్ మాట్లాడి పంటల పరిస్థితిని తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పద్మావతి, వ్యవసాయ అధికారి పి.నిర్మల, సర్పంచ్ అట్టాడ కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

భగవాన్‌దాస్ మస్టారుకు ఘనంగా నివాళులు



భగవాన్‌దాస్ మాస్టారు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

విజయనగరం: క్రీడారంగంలో కబడ్డీ, ఖోఖో క్రీడల పితామహుడిగా ఖ్యాతినార్జించిన స్వర్గీయ వై.భగవాన్‌దాస్ మాస్టారు సేవలు ఎనిలేనివని జిల్లా యోగా అసోయేషన్ అధ్యక్షుడు, జనసేన నాయకుడు అవనాపు విక్రమ్ పేర్కొన్నారు. భగవాన్‌దాస్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం భగవాన్ దాస్ మాస్టారు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అవనాపు విక్రమ్‌తో పాటు ఆయన శిష్యబృందం కస్పా ఉన్నత పాఠశాల ప్రాంగణంలో భగవాన్ దాస్ మాస్టారు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా స్థాయిలో ఉన్నత పాఠశాలలో చదువుతున్న బాలురకు నిర్వహించిన కబడ్డీ పోటీలను టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అవనాపు విక్రమ్ మాట్లాడుతూ దాస్ మాస్టారుతో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ చైర్మన్‌గా తన తండ్రి స్వర్గీయ అవనాపు సూరిబాబు అందించిన సేవలు గుర్తు చేసుకున్నారు. వారిద్దరి సారథ్యంలో కబడ్డీ క్రీడలో విజయనగరం జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు. మళ్లీ కబడ్డీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఈ సందర్భంగా అవనాపు విక్రమ్ వెల్లడించారు. కార్యక్రమంలో భగవాన్ దాస్‌తో పాటు కబడ్డీకి సేవలు అందించిన వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, చిన్నంనాయుడు, చిట్టిరాజు, టీఎల్‌పీ రాజు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కేవీ ప్రభావతి, విశ్రాంత వ్యాయామ అధ్యాపకుడు బొమ్మన రామారావు, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు, వ్యాయామ ఉపధ్యాయులు, కబడ్డీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జిలాస్థాయి కబడ్డీ పోటీలకు 27 జట్లు హాజరు

స్వర్గీయ వై.భగవాన్‌దాస్ మాస్టారు జయంతిని పురస్కరించుకుని భగవాన్‌దాస్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల బాలుర కబడ్డీ పోటీలకు అనూహ్య స్పందన లభించింది. కస్పా ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 27 జట్లు హాజరయ్యాయి. జోరువానలో సైతం ఆద్యంతం ఉత్కంఠభరితంగా పోటీలు సాగాయి. పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతి ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మేలుకొలుపు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: వినియోగదారుల చట్టాలపై ప్రజలందరికీ అవగాహన ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ వినియోగదారుల దినోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పౌరుడు చట్టాల గురించి తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. వినియోగదారుల చట్టాలపై అవగాహన కల్పించేందుకు వినియోగదారుల క్లబ్‌లను నిర్వహిస్తున్నామన్నారు. పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ బాక్సుల్లోని తినుబండారాలు, రోడ్లపై బండ్ల వద్ద తయారయ్యే కలుషిత ఆహారాన్ని తినడం వల్ల క్యాన్సర్ వంటి రోగాలు వచ్చే ఆస్కారం ఉంటుందని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు స్వచ్ఛ సుందర పార్వతీపురం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇటీవల సైబర్ క్రైం, ఈ-కామర్స్ మోసాలకు గురవుతున్నారని, దీనిపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. వినియోగదారుల దినోత్సవం సందర్భంగా కళాశాల, పాఠశాల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను, సర్టిఫికెట్లను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా మేలుకొలుపు పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వినియోగదారులను చైతన్యపరిచే పలు సంస్థల వలంటీర్లను సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ శాఖల ప్రదర్శన స్టాల్స్‌ను తిలకించారు. కార్యక్రమంలో కేఆర్‌ఆర్‌సీ ప్రత్యేక ఉప కలెక్టర్ టి.ధర్మ చంద్రారెడ్డి, వైద్యారోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి. జగన్‌మోహన్‌రావు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టి. శ్రీనివాసరావు, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ కె. రత్నరాజు, జిల్లా ఆహార తనిఖీ అధికారి ఎ.రామయ్య పాల్గొన్నారు.

గంజాయి నియంత్రణలో కఠినంగా వ్యవహరించాలి

- ఎస్పీ వకుల్ జిందాల్
- జిల్లా పోలీస్ కార్యాలయంలో నేర సమీక్ష సమావేశం



నేరసమీక్షా సమావేశంలో అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: గంజాయి అక్రమ రవాణా నియంత్రణలో కఠినంగా వ్యవహరించాలని, అక్రమ రవాణాకు పాల్పడిన వారిని అరెస్టు చేస్తూనే, వారికి గంజాయి సరఫరా చేసే వ్యక్తులు, మధ్యవర్తిగా వ్యవహరించిన వారిని, ప్రధాన వ్యాపారులను గుర్తించి, ఆయా కేసుల్లో నిందితులుగా చేర్చాలని ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులకు సూచించారు. జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్‌లలో పనిచేస్తున్న పోలీస్‌అధికారులతో మంగళవారం ఆయన నేర సమీక్ష సమావేశాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేరాలను నియంత్రించడంలో పగలు, రాత్రి బీట్లు వేయాలని, పెట్రోలింగ్‌ను మరింత విస్తృతం చేయాలని సూచించారు. నేరాలు, ఈవ్‌టీజింగ్ జరిగేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలు, ప్రజలతో నిత్యం రద్దీగా ఉండే వ్యాపార కూడళ్లు, బ్యాంకులు, కళాశాలల వద్ద గస్తీని పెంచాలని స్పష్టం చేశారు. రాత్రి గస్తీకి వెళ్లే సిబ్బంది అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తుల వేలిముద్రలను పాపిలాన్ స్కానర్‌లో నిక్షిప్తం చేయాలని, వారి నేర చరిత్రను పరిశీలించాలని సూచించారు. రాత్రి 11 గంటల తర్వాత సహేతుకరమైన కారణం లేకుండా తిరిగే వారిపై కేసులు నమోదుచేయాలన్నారు. హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తులు ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్నట్లయితే వారి షీట్లను ఆయాప్రాంతాలకు బదిలీ చేసి, వారిపై నిఘా పెట్టాలని చెప్పారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన ఆస్తుల వివరాలను క్రమ పద్ధతిలో రిజిస్టర్‌లో నమోదుచేయాలన్నారు. పోక్సో, లైంగికదాడి కేసుల్లో దర్యాప్తును 60 రోజుల్లో పూర్తిచేసి, న్యాయస్థానాల్లో అభియోగపత్రాలను దాఖలు చేయాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో అనధికార మద్యం విక్రయాలు (బెల్ట్ షాపులు) లేకుండా చూడాలని, క్షేత్రస్థాయిలో నిఘాపెట్టి, బెల్ట్‌షాపులపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో పేకాట, కోడిపందాలు జరగకుండా చూడాలని, ముందస్తుగా సమాచారం సేకరించి దాడులు చేయాలని చెప్పారు.



ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న పూసపాటిరేగ ఎస్సై దుర్గాప్రసాద్

ప్రతిభావంతులకు ప్రశంసలు

వివిధ కేసుల్లో విధులను సమర్థవంతంగా నిర్వహించి ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందాల్ ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసాపత్రాలను అందజేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, న్యాయసలహాదారు వై.పరశురామ్, పలువురు సీఐలు, ఆర్‌ఐలు, వివిధ పోలీస్‌స్టేషన్‌లలో పనిచేస్తున్న ఎస్సైలు, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్సైలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

27న రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక

పార్వతీపురంటౌన్: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 27న రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడాపోటీలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీఓ ఎస్. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

జనవరి 7వ తేదీ నుంచి 13తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో జరగనున్న సీనియర్ జాతీయ వాలీబాల్ క్రీడా పోటీలకు రాష్ట్రం నుంచి సీనియర్ మహిళలు-పురుషుల జట్లకు ఎంపికలను క్రీడా ప్రాధికార సంస్థ ఈ నెల 27వతేదీన విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో సీనియర్ మహిళలు-పురుషుల జట్ల రాష్ట్ర స్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల జిల్లా సీనియర్ వాలీబాల్ మహిళ-పురుష క్రీడాకారులు ఆరోజు ఉదయం 7గంటల నుంచి ఆధార్ కార్డు, నేటివిటీ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోస్‌తో హాజరుకావాలని సూచించారు. జిల్లాలో గల వాలీబాల్ క్రీడాకారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని రాష్ట్రస్థాయి ఎంపిక కార్యక్రమంలో పాల్గొని జిల్లా తరఫున జాతీయ పోటీలకు ఎంపిక కాగలరని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9866805716, 9701648344 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జనవరిలో సామూహిక గృహప్రవేశాలు

విజయనగరం అర్బన్: జనవరి మొదటి వారంలో సామూహిక గృహప్రవేశాలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, జిల్లాలో వారంలోగా 1,492 గృహ నిర్మాణాలు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని గృహనిర్మాణ సంస్థ ఈఈ, డీఈ, ఏఈలతో గృహనిర్మాణాలపై మంగళవారం వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సమీక్షించారు. వాటిని పూర్తి చేయించి ఆన్‌లైన్‌లో సమాచారాన్ని అప్‌లోడ్ చేయించాలన్నారు. సమావేశంలో గృహనిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కూర్మినాయుడు, ఈఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: జిల్లాలో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వ భూములను గుర్తించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో పలు వసతులు ఏర్పాటు చేయాల్సి ఉన్నందున అందుకు అవసరమైన భూమిని మండలాల్లో గుర్తించాలని సూచించారు. 100 విద్యుత్ కనెక్షన్ల కంటే ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో సోలార్ పవర్ ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని గుర్తించాలని చెప్పారు. గ్రామ పంచాయతీ భ భవనాల నిర్మాణానికి, ఫిష్ మార్కెట్ ఏర్పాటు, నగర వనాలు నెలకొల్పేందుకు, పారిశ్రామిక వాడల ఏర్పాటుకు అవసరైన స్థలాలను గుర్తించాలని స్పష్టం చేశారు. ఫిష్ హ్యాచరీస్ నిర్మాణానికి ఐదు హెక్టార్ల భూమి అవసరమని అభిప్రాయ పడ్డారు. అడంగల్‌ను సక్రమంగా నిర్వహించాలని కోరారు. పీజీఆర్‌ఎస్‌లో వచ్చిన అర్జీలపై పూర్తిస్థాయిలో విచారణ చేసి పరిష్కరించాలని స్పష్టం చేశారు. సమావేశంలో పార్వతీపురం, పాలకొండ సబ్‌కలెక్టర్లు అశుతోష్ శ్రీవాత్సవ, సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ కె.హేమలత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సమయం

- శతశాతం ఫలితాల సాధనకు 'సంకల్పం'
- విడుదలైన పరీక్షల షెడ్యూల్.. మార్చిలో నిర్వహణ
- జిల్లాలో 84 కళాశాలల నుంచి 17,403 మంది పరీక్షలకు సంసిద్ధం



పాలకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక తరగతుల్లో నిమగ్నమైన ఇంటర్‌మీడియట్ విద్యార్థులు

పాలకొండ రూరల్: సగటు విద్యార్థికి ఇంటర్‌మీడియట్ విద్య కీలక దశ. ఇక్కడే అధిక సంఖ్యలో విద్యార్థులు వెనుకబడి పోతుంటారు. ఈ పరిస్థితిని అధిగమించి ఉత్తమ ఫలితాల సాధనకు రాష్ట్ర ఇంటర్‌మీడియట్ బోర్డు ప్రత్యేక దృష్టి పెట్టింది. విద్యార్థుల హాజరుపెంపుతో పాటు వ్యక్తిగత ప్రమాణాలను పెంచేలా చర్యలకు ఉపక్రమించింది. ఈ విద్యా సంవత్సరం పార్వతీపురం మన్యం జిల్లాలోని వివిధ రంగాలకు చెందిన 84 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం 8968మంది, ద్వితీయ సంవత్సరం 8435 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇప్పటి నుంచి పరీక్షలు పూర్తయ్యే వరకు విద్యార్థులు తప్పనిసరిగా కళాశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. గైర్హాజరవుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలని, ప్రతి విద్యార్థిపై దృష్టి పెట్టాలని డీఐఈఓ జిల్లాలోని ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను ఆదేశించారు.

పాఠ్యాంశాల వారీగా..

ఇంటర్మీడియట్ పరీక్షలకు మూడు నెలల సమయం ఉండడంతో విద్యాశాఖాధికారులు పాఠ్యాంశాల వారీగా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నారు. ప్రస్తుత నెలలో పరీక్షలు నిర్వహించి ప్రతి విద్యార్థి స్థాయిని అంచనా వేయనున్నారు. వెనుకబడిన వారిని, ముందున్న వారితో సమానం చేసేందుకు ప్రణాళిక రూపొందించుకుని రెండో నెలల పాటు ఈ విధానం అమలు చేయనున్నారు. ఇలా పబ్లిక్ పరీక్షల సమయం వరకు అందరూ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు మార్చి 1 నుంచి 19వ తేదీ వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మార్చి 3 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

శ్రద్ధగా చదువుకునేలా..

జిల్లాలోని అన్ని ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులను బృందాలుగా విభజించి, ఒక్కో బృందం బాధ్యతలను ఒక్కో అధ్యాపకుడితో అనుసంధానం చేశారు. విద్యార్థులు రోజూ కళాశాలకు వచ్చేలా, అన్ని పాఠ్యాంశాల్లో ఉత్తీర్ణత సాధించేలా చేయడం ఆ అధ్యాపకుడి బాధ్యతే. ఇందులో భాగంగా కళాశాలలోనే కాకుండా ఇంటికి వెళ్లిన తర్వాత చదువుకునేలా ఉదయం త్వరగా నిద్రలేచేలా చూస్తున్నారు. ఆ సమయంలో చదువుకుంటున్నారా లేదా అనే అంశాన్ని సెల్ ఫోన్ ద్వారా వాకాబు చేస్తున్నారు. స్థానికంగా ఉంటే నివాసాలకు వెళ్లి పరిశీలిస్తున్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు మానసికంగా ఒత్తిడికి గురికాకుండా ఉండడంతో పాటు మత్తు పదార్థాల వినియోగంతో కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందుకోసం ప్రతి కళాశాలలో ఒక అధ్యాపకుడిని కౌన్సిలర్‌గా నియమించారు.

సంకల్ప్ కార్యక్రమం..

ప్రతి జూనియర్ కళాశాలలో ఉత్తీర్ణత పెంచేందుకు సంకల్ప్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఇందులో విద్యార్థులను వారి అభ్యసన సామర్థ్యం, అక్టోబర్‌లో నిర్వహించిన క్వార్టర్లీ పరీక్షల్లో మార్కుల ఆధారంగా 3 కేటగిరీలుగా విభజిస్తారు. మెరుగైన విద్యార్థులను ఎ కేటగిరీ, మధ్యస్థంగా ఉన్న వారిని బి కేటగిరీ, తక్కువ మార్కులు వచ్చిన వారిని సి కేటగిరీగా విభజిస్తారు. అర్ధ సంవత్సరం పరీక్షలు, ప్రీ ఫైనల్స్ పరీక్షల మార్కులను ఆధారంగా వారి కేటగిరీల్లో కూడా మార్పులు చేస్తారు. మధ్యాహ్నం 3గంటల నుంచి 5 గంటల వరకు ప్రత్యేకశిక్షణ తరగతులు నిర్వహిస్తారు.

ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషి



జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంచాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. శాఖాపరమైన ఉన్నతాధికారుల సూచనలతో సంకల్ప్ కార్యక్రమం ప్రతి కళాశాలలో అమలయ్యేలా చర్యలు చేపడుతున్నాం. క్షేత్రస్థాయిలో జూనియర్ కళాశాలలను పర్యవేక్షించి అక్కడి పరిస్థితులను పరిశీలిస్తున్నాం. ప్రభుత్వ కళాశాలల్లో సరైన బోధన, శిక్షణ ఇచ్చి ఉత్తీర్ణత పెంచేందుకు కృషి చేస్తున్నాం.

– దుంగ మంజులవీణ, ఇంటర్‌మీడియట్ జిల్లా విద్యాధికారిణి

సమాజ ఆరోగ్యం కోసమే ఫిట్‌ఇండియా



ఫిట్ ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

పార్వతీపురం: సమాజం ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఫిట్‌ఇండియా కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని సబ్‌కలెక్టర్, ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన కలెక్టరేట్ ఆవరణలో సెట్విజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫిట్ ఇండియా సైక్లింగ్ ర్యాలీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా యువతతో కలిసి సైకిల్ తొక్కి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ రోజురోజుకు యాంత్రీకరణ పెరిగిపోతున్న తరుణంలో సైకిల్ వినియోగం తగ్గిందన్నారు.ఈ కారణంగా వ్యాయామం లేక పలు రుగ్మతలు వస్తున్నాయని, దీన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్రప్రభుత్వం సైకిల్ వినియోగంపై అవగాహన, ప్రాముఖ్యాన్ని తెలియజేసేందుకు ఫిట్ ఇండియా కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. సైకిల్ వినియోగం వాయు కాలుష్యం, ట్రాఫిక్ రద్దీని తగ్గించడంలో ఎంతో దోహదం చేస్తుందన్నారు. ఇంధనం పొదుపు చేయడమే కాకుండా సైకిల్ తొక్కడం ఎంతో ఆరోగ్యంగా ఉండేలా చేస్తుందన్నారు. సైకిల్ వినియోగం పెంచేలా యువత ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సెట్విజ్ సీఈఓ బి.రాంగోపాల్‌తో పాటు కళాశాలల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



సైకిల్ తొక్కుతున్న సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ